

(గత సంచిక తరువాయి)

"**బయటి దేశం వారు** మా దేశం మీదకి యుద్ధానికి రాలేదు. మాలో మేమే అంతర్గతంగా బృందాలుగా విడిపోయి యుద్ధాలు చేసుకుని సర్వనాశనమయ్యాం. ఇలాంటి సివిల్ వార్‌లో ప్రాణ, మాన, ఆస్థినష్టాలు జరిగేది ఎప్పుడూ సామాన్యప్రజలకే. ఇంత జరిగినా అల్–అసాద్‌ని దింపలేకపోయారు. ఆయన ఇంకా పదవిలో కొనసాగుతున్నాడు."

ఖాలెద్ లేప్‌టాప్‌లో యూరప్ మేప్‌ని కర్సర్‌తో తను వివరించే దేశాలని, వాటి సరిహద్దులని చూపిస్తూ వివరించాడు.

"సిరియన్ కాందిశీకులు వెళ్ళకుండా గ్రీన్‌నించి వెస్టర్న్ యూరప్‌కి మార్గమైన బాల్కన్ రూట్‌ని స్లోవేనియా మూసేసి మానవత్వపు అవసరం ఉన్నవారిని, రాజకీయ పునరావాసానికి అప్లై చేసేవారినే అనుమతించింది. సరైన ఐడెంటిఫికేషన్ పత్రాలు లేనివారిని ఆపేసారు. సెర్బియా కూడా దారిని మూసేసింది. ఆస్ట్రియా, హంగరీ, స్లోవేకియాలనించి వెళ్ళలేక వేలమంది గ్రీస్‌లో చిక్కుబడ్డారు. 2015కల్లా పది లక్షలమంది చట్ట విరుద్ధంగా సిరియానించి ఇ.యూ దేశాల్లోకి ప్రవేశించారు. ఆగస్ట్ 2015కి నాలుగున్నర సంవత్సరాల యుద్ధంలో రెండున్నర లక్షలమంది సిరియన్స్ ప్రాణాలు కోల్పోయారు. దేశం నిండా సమాధులే. నా దేశ ప్రజలు ఓ నియంత చెడు పరిపాలనకి, మతమౌఢ్యానికి చమురుమీద విదేశాలకి గల ఆశకి బలయ్యారు."

అక్కచెల్లెళ్ళిద్దరూ అవాక్కై అతను చెప్పే ఘోర చరిత్రని వింటున్నారు. 'ఇంత ఘోరం జరిగినా ఇండియాలోని నాకు తెలీలేదా?' అన్న ఆలోచన ఆద్యకి వచ్చింది. ఎందుకు తెలీలేదో కూడా అర్థంచేసుకోగలిగింది. ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల రేగింగ్, హీరోయిన్‌ని ఏడిపించే హీరో, లెక్చరర్స్‌ని ఎగతాళి చేసే విద్యార్థుల బృందం, అర్థంకాని లిరిక్స్ పాటలు, పిచ్చి కారణాలకి విడిపోయిన హీరోహీరోయిన్స్‌తో తన కాలం గడిచిపోయింది.

అతను లేచెళ్ళి ఓ గ్లాస్‌లో విస్కీని చిన్న పెగ్ పోసుకుని వచ్చి కూర్చుని చెప్పాడు.

"విత్ యువర్ పర్మిషన్."

"అడగాల్సిన పనిలేదు" ఆద్య చెప్పింది.

"జర్మన్ భాషలో 'వెర్ష్‌లించెసెర్న్' అనే పదం ఉంది. ఈ జర్మన్ పదానికి ఇంగ్లీష్‌లో సరైన పదం లేదు. మంచి చేయాలనుకుని దాన్నింకా అధమంగా మార్చడం అనే అర్థంలో దీన్ని వాడతారు. కేసినోకి వెళ్ళి ఇరవై డాలర్లతో జూదం ఆడావు. మొత్తం ఓడిపోయావు. పోయిన సొమ్ముని గెలుచుకోడానికి ఇరవై డాలర్లు అప్పుచేసి మళ్ళీ ఆడి అదీ పోగొట్టుకున్నావు. దాన్నప్పుడు వెర్ష్‌లించెసెర్న్ అంటారు."

"ప్లంబర్ని పిలవకుండా తనే బాగుచేద్దామనుకుని పంపుని ఇంకాస్త చెడగొట్టడం వెర్ష్‌లించెసెర్న్ కదా?" చైత్ర అడిగింది.

"అవును. నీకు అర్థమైంది. ఆ పద్మ మా సిరియా రాజకీయాలకి చక్కగా సరిపోతుంది. నాకోటి అనిపిస్తోంది. 1962లో అల్జీరియా నూట ముప్పై రెండు ఏళ్ళ ఫ్రాన్స్ పాలననించి స్వతంత్రం పొందింది. ప్రజలు పాశ్చాత్య నాగరికత ప్రభావంతో పాడయ్యారనే ఆరోపణతో 1992లో ఇస్లామిక్ మిలిటెంట్స్ అల్జీరియా మీద యుద్ధం ప్రకటించారు. ఫలితంగా అరవై ఐదువేలమంది మరణించారు. వారిలో ఎక్కువమంది అమాయక ప్రజలే. మిలిటెంట్స్ ప్రభుత్వాధికారులని, విలేకరులని, రచయితలని, సంగీతకారులని, రెండువందలమంది టీచర్లని చంపి, ఐదువందల స్కూళ్ళని తగలబెట్టారు. బురఖా వేసుకోని స్కూలు విద్యార్థినుల గొంతులు కోసారు. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు కూడా ఐసిస్ వారిలానే ప్రవర్తించి ఖురాన్‌లో చెప్పిన రీతిలో నడుచుకోని ప్రజలని చంపారు. కొన్ని ముస్లిం దేశాలు స్త్రీలు హిజాబ్‌ని తప్పనిసరిగా ధరించాలని కోరతాయి. మరికొన్ని ముస్లిం దేశాలు వాటిని ధరించద్దని బలవంతం చేస్తాయి. ఇక్కడ సమస్య స్త్రీ కాని, హిజాబ్ కాదు. అహంభావులైన మగాళ్ళు."

"యు సెడ్ ఇట్" చైత్ర చెప్పింది.

"ముస్లింలకి ఒక అల్లా, ఒక ఖురాన్, ఒక నెబీ ఉన్నారు. కాని షియా సున్నీ మసీదుకి, సున్నీ షియా మసీదుకి వెళ్ళదు. షియా, సున్నీలు అహ్మదియా మసీదుకి వెళ్ళరు. ఈముగ్గురూ సూఫీ మసీదుకి వెళ్ళరు. ఈ నలుగురూ ముజాహుద్దీన్ మసీదుకి వెళ్ళరు. ఇలా ముస్లీంలలో పదమూడు తెగలున్నాయి. మా ముస్లింలు అధికంగా ఉన్న ప్రదేశంలో వాళ్ళు ఆనందంగా లేరని, హింసలకి గురవుతున్నారని నాకు అనిపిస్తూంటుంది. గాజాలో, ఈజిప్ట్‌లో, లిబియా, మొరాకో, ఇరాన్, ఇరాక్‌లలో, యెమెన్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, లెబనాన్, పాకిస్థాన్లలోని ముస్లింలు ఆనందంగా లేరు. మరి వారు ఎక్కడ ఆనందంగా ఉన్నారు? ఆస్ట్రేలియాలో, ఇంగ్లండ్‌లో, ఫ్రాన్స్, ఇటలీలలో, జర్మనీ, స్వీడన్, అమెరికా, కెనడా, ఇండియాలలో. అంటే ఇస్లామిక్ దేశం కాని ప్రతీచోట ముస్లింలు ఆనందంగా ఉన్నారు. తప్పు ఇస్లాందా? కానేకాదు. వారి ఇస్లామిక్ నేతలది. ముస్లింలు ఆనందంగా ఉన్న దేశాలని పూర్తి ముస్లిం దేశాలుగా మార్చాలని ఆ నేతలు కోరుకుంటున్నారు. ఆ ఇస్లామిక్ నేతలని గుడ్డిగా నమ్మే, ఆనందంగా లేని దేశాలనించి ఆనందంగా ఉండే దేశాలకి వలస

వచ్చిన ముస్లింలు కూడా, అంత బాధలు అనుభవించాక కూడా ఆ దేశాలని ముస్లిం దేశాలుగా మార్చాలనుకుంటారు. భారీగా విరాళాలు పంపుతున్నారు. లండన్, పేరిస్‌లలో, ఇంకా చాలా చోట్ల ముస్లిం ఉగ్రవాదుల దాడులు ఎన్నో జరిగాయి.

"హిందువులతో కలిసి జీవించే బుద్ధిస్ట్‌లకి ఎలాంటి సమస్యాలేదు. క్రిస్టియన్స్‌తో కలిసి జీవించే హిందువులు, బుద్ధిస్ట్ లకి ఎలాంటి సమస్యాలేదు. యూదులతో కలిసి జీవించే నాస్తికులకి, సిక్కులకి ఎలాంటి సమస్యలేదు. కాని క్రిస్టియన్స్, బుద్ధిస్ట్‌లు, యూదులు, నాస్తికులు, షింటోలు, బహాయ్, హిందువులకి తమతో కలిసి జీవించే ముస్లింలతో సమస్య. ముస్లింలతో నివసించే ముస్లింలకి సమస్య. ఇండియన్ జెండాలని తగలపెట్టే ఇండియన్ ముస్లింలు ఉన్నారు. కాని ఇండియాలో మూడు లక్షల మసీదులున్నాయి. ప్రపంచంలోని మరే దేశంలో ఇన్ని మసీదులని అనుమతించలేదు. ఇండియా అంటే నాకు చాలా ఇష్టం, కారణం పదికన్నా ఎక్కువ మతాలు, వందకన్నా ఎక్కువ భాషలు ఉన్నాయి. ఐనా ప్రజలు శాంతిగా, ఆనందంగా కలిసి జీవిస్తున్నారు. సూదినించి మార్స్‌కి వెళ్ళే రాకెట్‌దాకా నిర్మించడానికి వీరందరి కాంట్రిబ్యూషన్ ఉంది. నాకు ఇండియా అంటే అసూయ కూడా. ఎందుకంటే మా సిరియాలో ఒకే మతం, ఒకే భాష ఉన్నా చంపడాలు అధికం. మీ ఇండియానించి ప్రపంచం సహనాన్ని, శాంతిగా కలిసి మెలసి జీవించడాన్ని నేర్చుకోవాలి. హిందూ పేపర్‌లో జర్నలిస్ట్‌లు రాసిన ఏదైనా ప్రచురిస్తారు. సౌదీ గెజెట్‌లో సౌదీ అరేబియా జర్నలిస్ట్‌లు ఏం రాసినా ప్రచురించరు. పరిణితి చెందిన మనిషి లక్షణాల్లో ఒకటి ఓపెన్ మైండెడ్‌గా ఉండి, మనుషుల్లోని విభిన్న తేడాలని గౌరవించడం. పరిణితి చెందినవాళ్ళు అనవసరపు అంశం మీద పోట్లాడేకంటే నిశ్శబ్దంగా ఉంటారు. ఎక్కువగా క్షమిస్తారు. నేనీ మధ్య ఫిలసాఫికల్‌గా ఆలోచిస్తున్నాను చైత్రా.. టైమైంది. వెళ్దామా?" చేతి గడియారం వంక చూసుకుని లేప్‌టాప్‌ని ఆఫ్ చేస్తూ అడిగాడు.

కారులో కొద్దిసేపు గంభీరమైన నిశ్శబ్దం అలుముకుంది.

"సిరియాలో నేనో నాలుగేళ్ళ పిల్లని ఫోటో తీయడానికి కెమేరాని ఆమెవైపు ఉంచగానే చేతులెత్తింది. ఆ పాప కళ్ళల్లోని భయం స్పష్టంగా కనిపించింది. నా చేతిలోది తుపాకీ అనుకుందిట. ఆ ఫోటో చూసినప్పుడల్లా నా దేశం ఎలా నాశనమైపోయిందో నాకు గుర్తు వస్తూంటుంది. మతం కోసం జరిగే ఆ మారణకాండని చూసాక నాకు మా మతం మీద, అసలు దేవుడిమీదే విశ్వాసం పోయి నాస్తికుడిని అయ్యాను. నేను అంతర్జాతీయ పౌరుడ్ని తప్ప ముస్లిం మతస్థుడిని అనుకోను. పంది మాంసాన్ని తింటాను. హలాల్ భోజనం కోసం చూడను. రంజాన్‌లో ఉపవాసం ఉండను. నాలా చాలామందిని సిరియాలోని అంతర్గత పోరాటం నాస్తికులుగా మార్చింది.

"మనిషి పుట్టగానే అతనికో పేరు, కులం, మతం, జాతి, వర్గం, దేశం మొదలైనవి ఇవ్వబడతాయి. జీవితాంతం వారు ఈ కాల్పానికమైన వాటిని రక్షించుకోడానికి సంఘర్షిస్తారు. వాటికోసం ఒకోసారి తమ ప్రాణాలని కూడా

కోల్పోతారు. కారణం? వారు ఆలోచించరు. వారి తరపున ఆలోచించినవారు చెప్పింది నిజమని నమ్మరు. ప్రపంచంలో ఇలాంటి మానసిక బంధాలకి బానిసలైన లక్షలమంది ఎవరో ఓ పదవి కోరే రాజకీయ నాయకుడు చెప్పింది నమ్ముతారు."

"నిజమే ఖాలెద్! ఇండియన్స్ కాని, మరెవరైనా కాని ఇంతే. మా దేశంలో కూడా హిందువులు తమ మతాన్ని ప్రేమిస్తున్నామని అనుకుంటూ పరమత సహనాన్ని కోల్పోతున్నారు. కారణం మీ అల్ అసాద్‌లా పదవిని కోరుకునే లీడరే. రైట్ కంట్రీ ఇన్ రాంగ్ హేండ్స్" చైత్ర చెప్పింది.

"నువ్వు చెప్పింది నిజమే. ఓ రోజు నేను దుబాయ్ నించి షార్జాకి వెళ్తున్నాను. మేం సరిహద్దుని దాటాక డ్రైవర్ 'మనం దుబాయ్‌ని దాటి షార్జాలోకి ప్రవేశించాం' అని చెప్పాడు. బయటకి చూస్తే నాకు ఎలాంటి తేడా కనపడలేదు. ప్రకృతిలో సరిహద్దులు లేవు. సరిహద్దులు మన మనసులోనే ఉంటాయి. నదులు, కొండలు, చెట్లకి సరిహద్దులు ఉంటాయా? దేశం, మతం, కులం, ప్రాంతం, భాష మొదలైన సరిహద్దులన్నీ మనమే ఏర్పరుచుకుని తీవ్రంగా ప్రేమించే సంప్రదయ భావాలు. న్యూ ఇయర్ డే అనేది మన మనసులోనే ఉంటుంది. అది ప్రకృతిలో లేదు. అక్రమ సంతానం అనేది కూడా మన భావనే తప్ప అది ప్రకృతిలో లేదు. ప్రకృతిలో లేని ఇలాంటి చాలా మానవ కల్పిత ఆలోచనలకి, భావాలకి మనం ఎంత తీవ్రంగా బద్దులం అవుతున్నాం? ఎంత చిత్రం. ఈ సాంప్రదాయ, మానవ కల్పిత భావాలకోసం ప్రజలు మరణించడానికి సిద్దంగా ఉన్నారు. నిజంగా ఎంత చిత్రం" ఖాలెద్ చెప్పాడు.

తన మిత్రుల్లో ఇలా ఆలోచించేవారు ఎవరూ లేరు కదా అని ఆద్యకి ఆ క్షణంలో అనిపించింది. ఇందుకు విస్తృత ప్రపంచ జ్ఞానం, విశాల భావాలు అవసరమని కూడా స్ఫురించింది.

"ప్రతీ మతంలో స్త్రీలకి అన్యాయం జరిగింది. కాని ఆధునిక కాలంలో అవి కనుమరుగయ్యాయి. బైబిల్లో ఆడవాళ్ళు భర్తలకి, సమాజానికి, చర్చ్‌కి, దైవానికి లొంగి ఉండాలని చెప్పారు. మత్రగత్తెలన్న అనుమానంతో క్రైస్తవులు స్త్రీలని గుంజకి కట్టి తగలబెట్టడం ఇప్పుడు లేదు. హిందువుల్లో కాలానుగుణంగా సతీసహగమనం మాయమై, విధవలు లేదా విడాకులు తీసుకున్న మహిళలు మళ్ళీ వివాహాలు చేసుకుంటున్నాఉర్. ఆఫీసుల్లో పనిచేస్తున్నారు. ఇస్లాం ఇందుకు మినహాయింపు. ముస్లిం మహిళల పరిస్థితులు మారలేదు. ప్రపంచంలో మహిళలకి ప్రమాదకరమైన మొదటి పది దేశాలూ ముస్లిం దేశాలే అని మీకు తెలుసా? ఆఫ్ఘనిస్తాన్, యెమెన్, ఇరాక్, చాడ్, సూడాన్, సియెర్రా లియోన్.. ఛాందస మతస్థుల వల్ల మహిళలు బాధ పడుతున్నారు" ఖాలెద్ విచారంగా చెప్పాడు.

కారు ప్లాంటర్స్ లాడ్జ్ ముందు ఆగింది.

"మా ఊళ్ళో ఇదే ఫైవ్ స్టార్ హోటల్" ఖాలెద్ నవ్వుతూ చెప్పాడు. ఆకలి చచ్చిపోయిన ఆద్య సగం తిని వదిలేసింది.

"మనిషి తప్ప మతం ముఖ్యం కాని పాలకులు మాకు ఉండేవారు. మా మాజీ ప్రధానమంత్రి వాజ్‌పాయ్ హిందూ. ఆయన మరణించినప్పుడు మా దేశంలోని ప్రతీ ముస్లిం దుఃఖించాడు. మా మాజీ అధ్యక్షుడు అబ్దుల్ కలాం ముస్లిం.

ఆయన మరణించినప్పుడు మా దేశంలోని ప్రతీ హిందువూ దుఃఖించాడు. వారిద్దరూ నిజమైన ఇండియన్స్‌లా జీవించడమే అందుకు కారణం. దుఃఖించాల్సిన విషయం ఏమిటంటే, వారినించి ఇండియన్‌లా జీవించడం వారి రాజకీయ పార్టీల వారసులే నేర్చుకోవడం లేదు. పైగా ప్రజలని అలా జీవించకుండా మేధావులతో డిజిటల్ సెల్స్‌లో నిర్మించిన ఫోటోలు, వీడియోలు, కార్టూన్లని సోషల్ మీడియాలో ప్రవేశపెట్టి బలహీన మనస్కులైన, స్వంత ఆలోచనలేని ప్రజల్ని ప్రభావితుల్ని చేస్తున్నారు. రూబిక్స్ క్యూబ్‌ని ఒక్క మూవ్‌తో చెడగొట్టొచ్చు. కాని మళ్ళీ దాన్ని సరిచేయడానికి ఎన్నో మూవ్, ఎంతో శ్రమ, కాలం అవసరమౌతాయి. మా దేశ పరిస్థితి చెడగొట్టిన శాంతి అనే రూబిక్స్ క్యూబ్‌లాంటిది. మా దేశంలో డివైడ్ అండ్ రూల్ పాలసీలని అవలంబించి, ఇప్పటికే చాలామంది హిందువులకి ముస్లింల మీద ద్వేషాగ్నిని రగిల్చి వారినించి వేరు చేసారు" చైత్ర చెప్పింది.

"సరైన లీడర్ ప్రజల్లో మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తాడు. మతాల మధ్య వైరం లావా కుతకుతలాడే అగ్నిపర్వతమని మీ లీడర్స్‌కి తెలీకపోవడం ఆశ్చర్యం. ముఖ్యంగా దేశవిభజనప్పుడు మీ దేశంలో ఎంత రక్తపాతం జరిగిందో ఈ డెబ్బై ఏళ్ళల్లో మర్చిపోయారా? నేను వివరిస్తాను. ఈ ద్వేషం వ్యక్తిగతంగా మనిషి మీద కాదు. వారి మతం మీద. మా దేశంలో జరిగింది ఇదే. సున్నీలకి షియామతమంటే ద్వేషం. షియాలకి సున్నీ మతమంటే ద్వేషం. ప్రజల్లోని ఇలాంటి విద్వేషం మతం మీద తప్ప, వ్యక్తులమీద ఉండదు. వ్యక్తులుగా వారిని ఆదరిస్తారు. మతం మీదే ద్వేషం కురిపిస్తారు. అది క్రమంగా వారి మధ్య యుద్ధానికి దారి తీస్తుంది. అప్పుడు అది మనుషుల మీద చూపిస్తారు. ఇప్పుడే జాగ్రత్త పడకపోతే ఏదో రోజు తమని తమ మాతృదేశానికి శత్రువుల్లా చూడటంతో ఆ వర్గంలోని వారు సహనం కోల్పోయి, అది రక్తపాతానికి దారి తీసే అవకాశం ఉంది. అందుకు మా ముస్లిం దేశాలు గొప్ప ఉదాహరణలు" ఖాలెద్ చెప్పాడు.

"నా భయం కూడా అదే. ఎవరు తీసిన గోతిలో వారు ఏదోనాడు పడక తప్పదు" చైత్ర చెప్పింది.

"అదిప్పుడు వెంటనే జరగదు. వరద పొంగడానికి ఎన్ని వర్షపు చినుకులు అవసరమో అన్నీ కురిసాక నది పొంగినట్లు ఆ సివిల్ వార్లోని బాధలని దీన్ని ప్రోత్సహించే నేటి తరంవారు కాక వీరి సంతానం లేదా వారి సంతానం అనుభవిస్తారు. తోటి ముస్లిం దేశాలు ఇండియన్ ముస్లిం పక్షానికి వస్తే పరిస్థితి మరింత ఘోరంగా మారుతుంది. లివ్ అండ్ లెట్ లివ్ పాలసీని అతిక్రమించిన ప్రతీ దేశంలో జరిగింది ఇదే అని చాలా దేశ చరిత్రలు చెప్తున్నాయి. చరిత్రనించి మనిషి పాఠాలు నేర్చుకోడని కూడా ఆ చరిత్రలు చెప్తున్నాయి."

వారి మధ్య జరిగే ఆ సంభాషణని ఆద్య ఆసక్తిగా వింటోంది. తను మిగిలినవారిలా ముస్లింల మీద ఏర్పరుచుకున్న ద్వేషం సబబేనా అనే ఆలోచన కలిగింది. తనకి ఎవరైనా ముస్లిం వ్యక్తిగతంగా హాని చేసాడా? అని ఆలోచించింది. లేదు. తను పళ్ళు కొనడానికి, టేక్సీకి, మాంసం కొనడానికి, తన తండ్రి ఇల్లు కట్టినప్పుడు ఇనుమును కొనడానికి ఆధారపడింది

వారిమీదే. ఆమెలో ఆ ద్వేషం కొద్దిగా కరిగింది . స్కూలుకి బొట్టు పెట్టుకు రావద్దని శాసించిన ముస్లిం టీచర్ మీద నిప్పులు కక్కిన తండ్రి తనకి ఫార్వర్డ్ చేసిన మెసేజ్ గుర్తొచ్చింది. అప్పటికే ముస్లింలు దేశానికి శత్రువులు అని బ్రెయిన్ వాషైన తన తండ్రికి ఈ వాదనని బోధించాలని కూడా ఆద్య అనుకుంది.

"నేను ఫిలసాఫికల్‌గా ఆలోచించడం నేర్చుకున్నాను. సరిగ్గా వెయ్యేళ్ళ క్రితం భూమి మీద జనాభా సంఖ్య షుమారు ఇరవై ఎనిమిది కోట్లు. వెయ్యేళ్ళ తర్వాత ఇప్పుడు షుమారు ఆరువందల పదిహేను కోట్లు. ఈ వెయ్యేళ్ళల్లో జనాభా ఇరవై రెండు రెట్లు పెరిగింది. కాబట్టి కొన్ని లక్షలమంది సిరియన్స్ మరణిస్తే భూమికి వచ్చిన నష్టంలేదు అనుకుంటూంటాను."

"మేధావులు ఒకే విషయాన్ని ఇంకో కోణంలోంచి ఆలోచిస్తారు" అని చైత్ర చెప్పిన మాటలు ఆద్యకి గుర్తుకి వచ్చాయి.

"ఓసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ప్రపంచం మనకి చాలా మాస్క్‌లని తొడుగుతుంది. ఆనందం, విచారం, అహం, చెడ్డతనం ఇంకా ఎన్నో. వాటిని ధరించాక మన అసలు మొహాన్ని మనం కాపాడుకోవాలి అని తెలుసుకున్నాను" అతను చెప్పాడు.

గుడ్ నైట్ చెప్పబోయేముందు ఖాలెద్ ఫోన్‌లో ఓ ఫోటోని చూపించాడు. రక్తసిక్తమైన నాలుగేళ్ళ బాలుడి ఫోటో అది.

"పధ్నాలుగు సెప్టెంబర్ 2014న రోమక్కర్ 'స్పీచ్‌లెస్' అనే శీర్షికతో దీన్ని పోస్ట్ చేసాడు. సిరియాలోని బాంబు పేలుడులో రక్తసిక్తమై మరణించించబోయేముందు ఆ నాలుగేళ్ళ సిరియన్ బాలుడు చెప్పాడు.

"నేను దేవుడికి అంతా చెప్తాను."

వాళ్లని ఇంటి దగ్గర దింపి అదే కారులో ఖాలెద్ వెళ్ళిపోయాడు. థాంక్స్ చెప్పి డ్రైవర్‌కి చైత్ర పాతిక సి.డి.లు ఇచ్చింది.

29

ఆద్య టకరోడీకి వచ్చిన మూడో, ఆఖరి శుక్రవారం అది. ఆ సాయంత్రం చైత్ర నాలుగుం పావుకల్లా ఇంటికి చేరుకుంది. వస్తూ మేరినేటెడ్ చికెన్‌ని తెచ్చింది.

"ఎన్రికో మనకోసం మారినేట్ చేసాడు. ఇవాళ ఫ్రైడే మీట్ పియర్ ఇంట్లో. మనం ఏడులోగా అక్కడికి చేరుకోవాలి. ఖాలెద్ మనం ఎప్పుడు రెడీ అని చెపితే, అప్పుడు పికప్ చేస్తాడు" చెల్లెలికి చెప్పింది.

హైద్రాబాద్‌నించి ఆద్యతో వచ్చిన సరుకుల్లో బిర్యానీ చేయడానికి అవసరమైనవన్నీ ఉన్నాయి. ఇద్దరూ కలిసి యు ట్యూబ్‌లో చూసి చికెన్ బిర్యానీ చేసారు.

"గుర్తుందా అక్కా? నేను టెంత్‌లో ఉండగా ఓ పెద ప్రెషర్ కుక్కర్ కొని ఎవర్నో భోజనానికి పిలిచాం. ఆ పెద్ద కుక్కర్లో అన్నం వండాక మూత ఎంతకీ తిరగదే. గట్టిగా బిగుసుకుపోయింది. ఎంతమంది ప్రయత్నించినా అది రాకపోవడంతో దాన్ని కొన్న షాప్ కి తీసుకు వెళితే వాళ్ళు తీసారు. రెండు గంటలు ఆలస్యంగా తిన్నాం."

అది గుర్తుకి వచ్చిన చైత్ర పగలబడి నవ్వుతూ బిర్యానీని వండింది.

ఖాలెద్‌కి ఫోన్ చేసిన్ ఐదు నిమిషాల్లో వచ్చాడు.

"గుడీవినింగ్ లేడీస్. రోడ్ మీదకే ఘుమఘుమలు. కెన్ ఐ బెగ్ యు ఫరే పాపడ్?" నవ్వుతూ అడిగాడు.

"యు షుడ్ బెగ్ ప్రాపర్లీ. ఆన్ నీస్" చైత్ర చెప్పింది.

వెంటనే అతను మోకాళ్ళమీద కూర్చుని చెప్పాడు.

"యువర్ సర్వెంట్, ఖాలెద్, బెగ్స్ యు ఫరే అప్పడం."

"యు డింట్ హేవ్ టు డు దట్ ఖాలెద్.. అప్పడం? యు ఆర్ రిచ్ బై ఒన్ తెలుగు వర్డ్" ఆద్య పక్కున నవ్వి చెప్పింది.

పావుగంటలో పియర్ ఇంటికి చేరుకున్నారు. అతని ఇంటి కాంపౌండ్ వాల్‌మీద పెయింట్ చేసిన రెండు బొమ్మలు కనిపించాయి. గేటుకి ఎడమవైపు పెద్ద హృదయాకారం, అందులో కొన్ని దేశాలపేర్లు, కుడివైపు కాలితో బంతిని తన్నే ఆరేళ్ళ కుర్రాడు, దాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్న ఇద్దరు అదే వయసు కుర్రాళ్ళ బొమ్మ.

"హృదయంలోని పేర్లన్నీ అతను పనిచేసిన దేశాల్లో అతనికి నచ్చినవాటి పేర్లు. పియర్ మంచి పెయింటర్. అతని అన్న ఫ్రాన్స్‌లోని నీస్‌లో 'ఆర్ట్ కేఫ్' అనే కళాత్మక వస్తువులని అమ్మే షాప్‌ని నడుపుతున్నాడు" చైత్ర చెల్లెలితో చెప్పింది.

ఇద్దరూ లోపలకి నడిచారు. పియర్ ఆ ముగ్గుర్ని హగ్ చేసుకున్నాడు. బల్లమీద మిగిలినవారు తెచ్చిన వాటి పక్కనే తాము తెచ్చిన కేసరోల్‌ని ఉంచారు. క్రితం శుక్రవారం ఆద్యకి పరిచయమైన వారంతా హాజరయ్యారు.

ముందుగదిలో ఓ బోర్డ్‌కి ఉన్న బాణం గుర్తు చెక్కమీద 'నీస్ 7,389 కిలోమీటర్లు' అని రాసుండటం చూసింది.

"బాణం గుర్తువైపే నీస్ సిటీ ఉంది. ఇది హోమ్ సిక్‌నెస్ బోర్డ్" అది గమనించే ఆద్యతో చైత్ర చెప్పింది.

టీ బాగా అలవాటున్న ఖాలెద్ తను టీ కలుపుకోబోతూ అక్కాచెల్లెళ్ళు ఇద్దర్నీ అడిగి వాళ్లకీ కలిపాడు. వంటగదిలోంచి ట్రేతో తెచ్చి వాళ్ళ కప్పులని వాళ్ళకి ఇచ్చాడు.

"థాంక్స్ ఖాలెద్" ఆద్య చెప్పింది.

"ఇదేం టీ?" తాగాక అడిగింది.

"మచ్చా గ్రీన్ టీ. చేపల వాసన వేస్తోంది కదు? జపనీస్ టీ ఇది. కాని దీంట్లో చేపలేం కలపరు" చైత్ర నవ్వుతూ చెప్పింది. నవ్వించింది కూడా. ప్రతీవారి తలకి ఓ హెడ్ బేండ్‌ని కట్టుకున్నారు. దానికి ముందువైపు ఓ కార్డ్ పెట్టే సౌకర్యం

ఉంది. ఆ కార్డ్ మీద ఓ వస్తువు లేదా మనిషి లేదా జంతువు పేరు రాసుంటుంది. మిగిలిన వారందరు ఆటగాళ్ళకి అది కనిపిస్తుంది. కాని అది హెడ్ బేండ్‌కి ఉన్న ఆటగాడికి మాత్రం తెలీదు. మూడు నిమిషాల వ్యవధిలో అతను మిగిలినవారిని దాని గురించి 'ఎస్ ఆర్ నో' జవాబులు వచ్చేలా ప్రశ్నించి అదేమిటో కనుక్కొగలగాలి. పెరూకి చెందిన మిస్ క్రిస్టీనా లోపెజ్ మొదటగా ఆ ఆటలో పాల్గొంది.

పియర్ బొత్తిలోంచి తీసిన కార్డ్‌ని ఆమె హెడ్ బేండ్‌మీద ఉంచాడు. దానిమీది 'బాత్‌రూం' అన్న పదాన్ని చూసి అంతా నవ్వారు. ఆమె వరసగా కొన్ని ప్రశ్నలు వేసింది.

"నేను మనిషినా?"

"కావు."

"నేను ఈ ఇంట్లో ఉన్నానా?"

"ఉన్నావు."

"ఈ గదిలో ఉన్నానా?"

"లేవు."

"నేను తినే వస్తువునా?"

"కాదు."

చాలామంది ఫక్కున నవ్వారు. అది గ్రహించిన ఆమె కొన్ని క్షణాలు ఆలోచించి అడిగింది.

"సబ్బునా?"

"కాదు. కాని చాలా దగ్గరకి వచ్చావు" ఒకరు అందించారు.

"బాత్‌టబ్‌నా?"

"కాదు. ముప్పై క్షణాలే మిగిలి ఉంది."

"టాయ్‌లెట్ పేన్‌నా?"

"నో" ఆద్య ఫక్కున నవ్వి చెప్పింది.

"టాయ్‌లెట్ పేపర్?"

"నో" అంతా ఘొల్లున నవ్వారు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS